IJERSS ISSN 2348-1404(Online) | Volume 4| Issue 9 | SEP 2017

Research Paper

# తెలుగు తమిళ జానపదాల్లో దేశింగు రాజు

తెలుగు

Keywords :

డా|| ఝాన్సీ వాణి
రీడర్ , తెలుగు విభాగం, ఆర్ట్స్ కాలేజీ , బాపట్ల

మహా పురుషుల చరిత్రలను తెలుసుకోవాలనే జిజ్ఞాసవల్ల వారిని గూర్చి కథల రూపంలోనో, పాటల రూపంలోనో, నాటక రూపంలోనో వినీ చూసి ప్రజలు అనందిస్తుంటారు. తోలు బొమ్మలాటలు, బుర్రకథలు, వీధి భాగవతాలు, పిచ్చి గుంట్ల ద్వారా ప్రచారంలో వున్న అనేక గాథల్లో “దేశింగురాజు” వీరగాథ ప్రసిద్ధమైంది. ఉత్తర భారతీయుడైన “దేశింగురాజునకు” దక్షిణ భారతదేశంలో ముఖ్యంగా తమిళనాడు, ఆంధ్ర రాష్ట్రాలలో విశిష్ఠ ఖ్యాతి ఉండటం గుర్తించదగ్గ విషయం, తమిళులు “దేశింగురాజు” ని తమిళ వీరునిగా, తెలుగువారు తెలుగు వీరునిగా భావించుకుంటున్నారు. అతడి బలపరాక్రమాలను, గుణగణాలను కీర్తిస్తుంటారు.

“బుందేలు ఖండ వాసుల” కాలంలో జన్మించిన “దేశింగురాజు” రాజస్థాన రాష్ట్రానికి చెందినవాడు. ఇతడు ‘సెంజి’ ని పది నెలల పాటు మాత్రమే పరిపాలించినప్పటికీ పామర ప్రజల హృదయాల్లో సైతం చిరస్థాయిగా నిలిచిపోయాడు. అందుకు గల కారణాలను తెలుసుకునే ముందర ‘సెంజి’ కోటకు సంబంధించిన చారిత్రక ఇతివృత్తాన్ని గూర్చి పలురకాలుగా చెప్పబడుతున్నప్పటికి తమిళ నిఘంటువులో ‘సెంజి’ సంస్కృత ‘శృంగి’ శబ్ధ భవం కావచ్చునని సూచింపబడింది. కాల క్రమేణా అది స్రింగి, సింగి, సించి, సింజి, సెంచి, సెంజిగా రూపాంతరం చెందుండవచ్చు. మహారాష్ట్రీయుల ప్రభావంచేత ఆంగ్లేయులు, ఫ్రెంచీయులు ‘సెంజి’ ని జింజి అని పిలిచేవారు. ‘సెంజి’కి అతి సమీపంలో ‘సింగవరం’ అనే మరో వూరు వుంది. బహుశ అది పల్లవుల రాజధాని అయిన సింహపురం అయ్యుండవచ్చు. ఈ సింగవరం ప్రభావం చేత ‘సెంజి’ పేరేర్పడిందనడానికి కూడా అస్కారం లేకపోలేదు.

‘సెంజి’ కోట నిర్మాణాన్ని గూర్చి ఇదమిత్థంగా ఎవరూ చెప్పలేకపోయినప్పటికీ ‘ఆనంద గోమ్’ అనే గొర్రెల కాపరి ఒకనాడు ఒక చెట్టు క్రిందున్న రాతిమీద లిఖితమయిన విషయాన్ని ఒక ఋషిచేత చదివించి తెలుసుకొని ఆ ప్రకారం దాని క్రిందున్న ధనరాసుల్ని త్రవ్వి వెలికి తీసి కొ

ండపై ఒక కోటను (13 శతాబ్ధారంభం) నిర్మించాడని అదే ఈ 'సెంజి' కోట అని చెప్పబడుతున్న కథనాన్ని పలువురు విశ్వసిస్తున్నారు.

'సెంజి' ప్రాంతాన్ని కొంతకాలం "చోళులు, విజయనగర నాయకులు పరిపాలించారు. క్రీ॥శ॥ 1677లో సెంజిపై 'శివాజీ' అకస్మాత్తుగా దండయాత్ర జరిపారు. ఆ దండయాత్రలో శివాజి విజయం సాధించడంతో 'సెంజి' మహారాష్ట్రీయుల వశమైంది. క్రీ.శ. 1689 నుండి శివాజీ కొడుకు 'రాజారాము' (శివాజీ, సోమరాంబాయిల పుత్రుడు) సెంజికోటను పరిపాలించసాగాడు. క్రీ.శ. 1691లో ఔరంగజేబు 'సెంజి' ని ఆక్రమించుకోదలచి 'రాజారాము' పై యుద్ధం చేయడానికి "జుల్ఫికర్ఖాను" ని పంపిస్తాడు. దాదాపు 7 సంవత్సరముల యుద్ధానంతరం "జుల్ఫికర్ఖాను" సెంజిని కైవసం చేసుకుంటాడు. ఆ పిదప ఔరంగజేబు క్రీ.శ. 1700 ప్రాంతంలో 'స్వరూప్సింగ్'ని సెంజికి గవర్నరుగా నియమిస్తాడు. దక్షిణాదిలో జయం చేకూరడానికి సమకరించిన 'స్వరూప్సింగ్' కి పన్ను కట్టే విషయంలో ఔరంగజేబు మినహాయింపు కల్పించాడు. ఔరంగజేబు మరణానంతరం అతడి కుమారుడు 'బహదూర్షా' ఢిల్లీ సింహాసనం అధిష్టించాడు. ఆ సమయంలో మహారాష్ట్రీయులు, రాజపుత్రులు, సిక్కులు స్వతంత్రంగా జీవించడానికి సంకల్పించి మొగలాయిలను వ్యతిరేకిస్తూ పోరాటం సాగించారు. దీంతో ఢిల్లీ ప్రభుత్వం నిలదొక్కుకోవడానికి ఆర్ధిక సహాయం అవసరమౌతుంది. ఫలితంగా దక్షిణాధిన పన్నులు వసూలు చేసి పంపవలసినదిగా ఆర్కాటు నవాబుకి ఆజ్ఞలు జారీ చేయబడతాయి. పదునాలుగేళ్ళ పరిపాలనలో కట్టవలసిన 70 లక్షలు రూపాయలు పన్నుని వెంటనే చెల్లించవలసిందిగా అర్కాటు నవాబు 'స్వరూప్ సింగ్'కి ఆదేశించినప్పటికి పన్ను చెల్లించకుండానే ఉండిపోతాడు అనతి కాలంలోనే అంటే జనవరి 1714వ సంవత్సరంలో 'స్వరూప్ సింగ్' మరణిస్తాడు.

స్వరూప్ సింగ్ పుత్రుడు 'దేశింగ్' అనబడే 'తేజ్ సింగ్' ఇతడిని 'జయసింగ్' అని కూడా అంటారు 'బుందేలుఖండ్' లో ఉంటున్న 'దేశింగ్' తండ్రి మరణానతరం సెంజి కొచ్చి పదవి చేబడతాడు. స్వరూప్ సింగ్ కట్టవలసిన పన్ను మొత్తాన్ని ఆర్కాటు నవాబు దేశింగుని కట్టమని కోరతాడు. కానీ స్వతంత్ర భావాలుగల దేశింగ్ అర్కాటు నవాబుకి పన్ను కట్టడం అవమానంగా భావించి నిరాకరిస్తాడు. దాంతో ఆర్కాటు నవాబు దేశింగ్పై యుద్ధం ప్రకటిస్తాడు. దేశింగ్ తన ప్రాణస్నేహితుడైన 'మహామత్ఖాను' ని యుద్ధంలో తనకు సహకరించాల్సిందిగా కోరుతూ సందేశం

పంపిస్తాడు. పెళ్ళి పీటలపై ఆసీనుడైయున్న 'మహమత్ఖానుడు' కి స్నేహితుడి సందేశం అందటంతో చేతిలోని మంగళసూత్రాన్ని ప్రక్కన పెట్టి యుద్ధానికి బయలుదేరుతాడు. యుద్ధంలో వీరవిపరీరం చేసి లెక్కకు మించిన శత్రుసైన్యాన్ని హతమార్చి వీరమరణం పొందుతాడు.

స్నేహితుని మరణవార్తను విన్న 'దేశింగ్' రాజు ప్రళయంగా విరుచుకు పడతాడు. దౌలత్ ఖాన్, బంగారు నాయకుడు మున్నగువారిని హతమార్చి నవాబు సేనలను మట్టి కరిపిస్తాడు. దీంతో శత్రు సైనికుడొకడు ప్రాణాలతో దేశింగుని ఖైదు చేయాలనే నవాబు ఆజ్ఞనుల్లంఘించి ఏనుగు అంబారిలో దాగుండి కాల్చి చంపుతాడు. దేశింగ్ రాజుని తన సైనికుడు దొంగచాటుగా కాల్చి చంపినందుకు ఆర్కాటు నవాబు పశ్చాత్తాపం చెందుతాడు. దేశింగుని వీరత్వాన్ని ధైర్యసాహసాలను మెచ్చుకుంటూ, మద్రాసు సమీపంలోని 'రాణిపేట' పట్టణాన్ని దేశింగు భార్య పేర సాదుతుల్లాఖాను కట్టించినాడట. సతీసహగమనం చేసిన దేశింగ్ భార్య స్మృతిచిహ్నంగా 1777లో సాదుతుల్లాఖాను 'రాణిపేట' ను నిర్మించినట్లు "గ్లోసరీ ఆఫ్ మద్రాసు ప్రెసిడెన్సీ" (పుట 737) లో పేర్కొనబడింది.

ఇది అసలు కథ దీనికి ఆసక్తికరమైన అద్భుత వీర సాహస కృత్యాలను చేర్చి తమిళ, తెలుగు భాషల్లో ప్రజలనోట చెప్పబడుతోంది. వాటిలోని కథాంశాలను కూడా టూకీగా పరిశీలిద్దాం.

"స్వరూప్సింగ్"భార్య రాంబాయి నిండు గర్భిణిగా ఉన్నప్పుడు డిల్లీ పాదుషా ఒక పకీరు తనకిచ్చిన అద్భుత గుర్రాన్ని అణచి దాన్ని అధిరోహించడానికి దేశంలోని వీరులను ఆహ్వానిస్తూ 'స్వరూప్సింగ్' కి గుర్రపుస్వారీలో వున్న ప్రతిభను గూర్చి తెలుసుకొని అతడ్ని కూడా ఆహ్వానిస్తాడు అయితే గుర్రాన్ని అధిరోహించలేని రాజులు ఖైదులో ఉంచబడతారనే నిబంధనను విధిస్తాడు. స్వరూప్సింగ్, అతడి సోదరుడు ధరణిసింగు గుర్రాన్ని అణిచే ప్రయత్నంలో విఫలమై బంధీలుగా ఉండిపోతారు. స్వరూప్ సింగ్ డిల్లీ కెళ్ళిన ఏడవ దినము 'దేశింగు' జన్మిస్తాడు.దేశింగు తన 'ఐదవ' ఏట తల్లి ద్వారా తండ్రిని గూర్చి తెలుసుకొని తన స్నేహితుడు మహమత్ఖానునితో కలిసి డిల్లీ వెళ్ళి శ్రీరంగనాధస్వామి కృపతో ఆ గుర్రాన్ని అణచి తన తండ్రిని, పిన తండ్రిని బంధ విముక్తులను చేసాడు అని చెప్పబడుతొంది. ఈ కథల్లో చెప్పినట్లుగా దేశింగు రాజు 'సెంజి' లో జన్మించలేదు. సెంజిని స్వరూప్సింగ్ పరిపాలిస్తున్నప్పుడు కూడా 'దేశింగు' తమ స్వస్థలమైన 'బుందేల్ ఖండ్' లోనే ఉండేవాడు. క్రీ.శ. 1700 సంవత్సరంలో సెంజికి గవర్నరుగా నియమింపబడ్డ స్వ

రూప్‌సింగ్ 'జుల్ఫికర్‌ఖాన్' కి యుద్ధంలో తోడ్పడేందుకుగానూ ఐదారు సంవత్సరాల క్రితమే ద
క్షిణాపథంలో అడుగుపెట్టినప్పటికి అప్పటికే 'దేశింగు' జన్మించి ఉండి ఉండాలి. ఎందుకంటే క్రీ.
శ. 1714లో బహుశ ఆ 'దేశింగు'ని 'సెంజి'లో జన్మించాడని చెప్పుకోవడం తమకు మరింత స
న్నిహితుడని చాటుకోవడానికి అయ్యుంటుంది. అదే విధంగా దేశింగు 'ఐదేళ్ళ' ప్రాయంలో డిల్లీ
వెళ్ళి గుర్రాన్ని అణచడం పూర్తిగా కల్పితమే 'దేశింగు' ని వీరత్వానికి వన్నె చేకూర్చే ప్రయత్నమే
ఇది.

అంతేకాక డిల్లీ పాదుషా బాల దేశింగుని వీర సాహస కృత్యాలకు మెచ్చి ఎనలేని కానుక
లను 'బారాహజారి' అనే గుర్రాన్ని బహూకరించినట్లు బుర్రకథలో ఉంది. 'దేశింగు' బుందేల్ ఖ
ండ్‌లో ఉన్నప్పుడు 'పీతనూరు' రాజు మహారాష్ట్రులతో యుద్ధం చేయడం జరిగింది. ఆ యుద్ధం
లో దేశింగు పీతనూరు రాజు పక్షం నిలిచి యుద్ధం చేస్తాడు. ఫలితంగా ఆ రాజుకి విజయం చేక
ూరుతుంది. ఆ సంతోషంతో 'దేశింగు' కి విలువైన కానుకలను, మేలుజాతి గుర్రాలను బహుకరి
స్తాడు. బహుశ ఈ సంఘటననే ప్రజలు డిల్లీ బాదుషాకి అన్వయించి వుండవచ్చు.

'దేశింగు' రాజు వివాహం గురించిన కథలు విభిన్నంగా వున్నాయి. తమిళ కథల్లో (తెరుక
్కూత్తు) బాల దేశింగుని బల పరాక్రమాలను చూసి డిల్లీ బాదుషా గారి సైన్యాధిపతి 'భీమ్‌సింగ్'
ముగ్ధుడై దేశింగుకి తన కుమార్తెనిచ్చి వివాహం చేయాలని సంకల్పిస్తాడు. అయితే స్వరూప్ సిం
గు దేశింగుకి యుక్తవయస్సు వచ్చిన తరువాత ఆమెతో వివాహం జరపిస్తానని వాగ్దానం చేస్తాడు
. దేశింగుని పన్నెండవ యేట అతని తల్లిదండ్రులు మరణిస్తారు. ఆ పిదప కొన్నాళ్ళకు స్వరూప్
సింగ్ వాగ్దానం మేరకు 'ధరణిసింగు' (దేశింగుని పినతండ్రి) దేశింగునకు భీమసింగు కుమార్తెక
ు వివాహం జరిపిస్తాడని చెప్పబడి వుంది. కాని తెలుగు బుర్రకథల్లో 'దేశింగు' తన యేడవ యే
ట తల్లిని ఎనిమిదవ యేట తండ్రిని కోల్పోయాడని ఆ పిదప కొన్నేళ్ళకు దేశింగునకు అతని మా
మ కూతురితో వివాహం జరిగిందని చెప్పబడింది. చారిత్రకంగా పరిశీలించిపుడు దేశింగుని ఇర
వై రెండవ యేట అతడి తండ్రి మరణిస్తాడు. అప్పటికే దేశింగునికి వివాహమయ్యుంటుంది.

వివాహ సమయములోనూ, ఆ తరువాత ఆరు నెలల వరకు వారి జాతకఫలరీత్యా ఒకరి
నొకరు చూడరాదనే నియమం ఉన్నట్లు తమిళ, తెలుగు కథల్లో చెప్పబడుతోంది. వివాహ సమ
యంలో వధూవరులిద్దరి మధ్య తెరకట్టడం ఇప్పటికీ అనేక కులాల్లో ఆచరించబడుతున్నదే. అయి

ంతే తమిళుల సంప్రదాయంలో ఈ విధానం లేకపోవడంతో దీన్ని వారు దోషంగా పరిగణించి వుంటారు. అదే కాలక్రమేణా తెలుగు కథలో ప్రచారం చెందుండవచ్చు.

పన్ను కట్టడం నిరాకరించినందుకుగాను దేశింగుకి ఆర్కాటు నవాబుకి యుద్ధం జరగుతుంది. యుద్ధంలో తనకు సహాయపడవలసినదిగా తన స్నేహితుడు 'మహిమత్ఖాను'కి సందేశం పంపిస్తాడు. ఆ సమయంలో మహిమత్ఖానుడు పెళ్ళి పీటలపై వుంటాడు. ఈ ఘట్టం తమిళ, తెలుగు, కథల్లో కడు హృద్యంగా చిత్రించబడింది.

"అల్లారే యల్లారే యనచు నపుడు కట్టు వేళ
ముల్లా శాస్త్ర పద్ధతిగాను మొనసి కట్టు వేళ
గోవిందా గోవిందా యనుచు కోరి కట్టు వేళ"

తమిళంలో

"అల్లావే అల్లావే ఎన్ఱు తాళికట్ట పోరాన్
రాము రాము ఎన్ను తాళికట్ట పోరాన్"

స్నేహితుడి సందేశం తెలుసుకొని చేతిలోని మంగళసూత్రాన్ని జారవిడిచి యుద్ధానికి సన్నద్ధమవుతాడు. ఆనాటి హిందూ ముస్లీముల సఖ్యతకు ఇదొక గొప్ప నిదర్శనం. పెళ్ళి పీటల మీద నుంచి లేచిన కుమారుని చూచి అతడి తల్లి వారించగా అందుకు మహీమత్ఖానుడు...

"భువిలో పుట్టిన యవుడే చావు నిశ్చయమ్ము గదమ్మా
పోరు జయించిన శాశ్వత కీర్తిని పొసంగ గందునమ్మా
కినిసిదండులో పోరి తెగినను కీర్తిగలుగునమ్మా
వెనుగడుగులు పెట్టెదరే నూరులు వింతలు కాదమ్మా"

అంటూ చెప్పిన వాక్యాలను చవటలను సయితం వీరుల్నిగా తీర్చిదిద్దేంతటి శక్తి వుంది. చారిత్రకంగా కూడా మహిమత్ఖానుడు పెళ్ళి పీటల మీద నుంచి లేచి వచ్చి యుద్ధం చేసేడనే అభిప్రాయాన్ని పలువురు వెలిబుచ్చుతున్నారు. బహుశ నిజ జీవితంలో జరిగిన సంఘటన కావడంచేతనే ఈ ఘట్టానికి అధిక ప్రాధాన్యత చేకూరింది.

యుద్ధంలో ముందుగా పోరాడే అవకాశాన్ని తనకు ఇవ్వవలసిందిగా మహిమత్ఖానుడు దేశింగు రాజుని కోరడం, ఆ ప్రకారమే పోరాడి వీరస్వర్గం అలంకరించడం, మహిమత్ఖానుని మృ

తదేహాన్ని గాంచి అతడి గుర్రం "నీలవేణి" దు:ఖించడం తమిళ, తెలుగు కథల్లో బహుచక్కగా చి( తింపబడింది. అదే విధంగా స్నేహితుని మృతికి దేశింగు దు:ఖించే విషాద సన్నివేశం కంటనీరు తెప్పిస్తుంది.

"మహమ్మదుఖారన్ మున్నేవన్‌దాన్ రాజా దేశింగు
మండిపోట్టు ఉట్‌కార్‌న్ధాన్ అయ్యా రాజా దేశింగు
వారి ఎడుత్తు ముడియిల్ వైత్తాన్ రాజా దేశింగు
ముగత్తోడు ముగం వైత్తాన్ రాజా దేశింగు
కొడుకొడువెంను కదరి అళుదాన్ రాజా దేశింగు
ఎన్నైవిట్టు నీ ఎప్పడి పోనాయ్ మోవుత్తుకారన్
ఎనక్కునల్లయెడం తేడివైయ్యుం మోవుత్తుకాన్
నవాబై వెట్టి నానుం వరుగిరేన్ మోపుత్తుకారన్"

అంటూ విలపిస్తూ నీ ప్రాణాలు తీసిన ఆ నవాబుని చంపి నేను కూడా నీ వెంటే వస్తాను అన ఇ చెప్పడం వారి గాథ మైత్రిని ప్రతిఫలించే విధంగా తీర్చిదిద్దబడింది.

ఈ కథల్లో మనకు కనిపించే మరో మంచి ఘట్టం దేశింగు రాజుకీ అతని భార్యకీ సంభా షణ, యుద్ధానికి వెళ్లే ముందర దేశింగు తన భార్యను కలసి మాట్లాడాలనుకుంటాడు. అందుకు పినతండ్రి ధరణిసింగు ముందర అభ్యంతరం తెలిపినప్పటికీ చివరకు వారిద్దరి మధ్య తెరకట్టి ఎ ారిని మాట్లాడుకోవడానికి అనుమతి ఇస్తాడు. దేశింగురాజు యుద్ధానికి వెళ్ళడం పట్ల ఆమె విమ ుఖత తెలియచేస్తుంది. అయినప్పటికీ "దేశింగు" తన దృఢసంకల్పాన్ని ఇసుమంతైనా వీడక పోవ డంతో చివరకు

ఘన విక్రమమున దండున తెచ్చి గ్రక్కున మీరలున్
ముందు నఱుకునను పుడమిని బడినను ముఖ్యంబున నేను
సందేహము లేకను జేసెద విను సహగమనము తగను.
వెన్నుపోటుచే ధరగూలిన మిము కనులతో గనను"

అని ప్రతిజ్ఞ చేస్తుంది రాణీ సతీసహగమనం చేయడంవల్ల ఈ ప్రతిజ్ఞలను వూహించి కల్పించి వుంటారు. ఎందుకంటే రాజపుత్ర స్త్రీలలో సతీసహగమనం చేయడం ఆనాటి కులాచారం.

'దేశింగురాజు' యుద్ధానికి వెళ్ళేముందు శ్రీ రంగనాధ స్వామి ఆలయానికి వెళ్ళి యుద్ధంలో తనకు విజయం చేకూరాలంటూ ప్రార్ధిస్తాడని, ఆ సమయములో శ్రీ రంగనాధుని మెడలోని హారము తెగిపడుట, గోపుర శిఖరాలు విరిగి పడుట, చుక్కలు రాలి క్రిందపడుట వంటి దుశ్శకునాలతో పాటు స్వామి తన ముఖాన్ని పడమటి దిక్కుకి తిప్పేసుకుంటాడని కథల్లో చెప్పబడింది. ఈ దుశ్శకునాలను, మూఢనమ్మకాలని త్రోసివేయాలనుకున్న వారికి నిదర్శనంగా "సింగవరం" లోని రంగనాధునిపై శేషతల్ప శాయియై పరుండి పెడమొగము పెట్టిన విగ్రహం" కనిపిస్తుంది దేశింగునికి శ్రీరంగనాధునిపై వున్న భక్తి ఆధారంతో, విగ్రహం వున్న తీరుని బట్టి ఈ కల్పన జరిగి వుండవచ్చు. అయితే ఆ విగ్రహం ఈ తీరులో వుండటానికి గల కారణాలేమిటనేది పరిశీలించవలసివుంది.

ఈ దుశ్శకునాలని గమనించి కూడా యుద్ధం చేయడానికి సన్నద్ధమవుతున్న దేశింగు రాజుని పోవలదని శ్రీరంగనాధుడు వారిస్తాడనే కల్పనలు కనిపిస్తాయి. అయినప్పటికీ దేశింగురాజు కదనరంగంలో ప్రవేశించి శత్రు సైన్యాన్ని ఛిన్నాభిన్నం చేస్తాడని తన సైనికులందరూ నేలకొరగడంతో దేశింగు దాడిని తట్టుకోలేక ప్రాణభయంతో నవాబు పారిపోతాడనీ, ఇక తనతో యుద్ధం చేసేవారు లేకపోవడంతో అప్పటికే మిత్రుని వియోగం వలన దు:ఖ సాగరంలో మునిగివున్న దేశింగు జీవితంపట్ల విరక్తి చెంది తన కత్తిని పైకెగరేసి తన రొమ్ముని బారజాపుతాడని కత్తి గుండెల్లో దూసుకుపోవడంతో మరణిస్తాడని చెప్పబడింది. బహుశ యుద్ధంలో శత్రుసైనికుల చేతిలో మరణించాడని చెప్పడంవల్ల అతని వీరత్వానికి భంగం వాటిల్లుతుందని ఎంచి ఈ విధంగా కల్పించి వుండవచ్చు.

దేశింగురాజు మరణించడంతో అతని భార్య "రాణి" సతీసహగమనం చేస్తుంది.జానపద గేయాల్లోనూ, బుర్రకథల్లోనూ, తమిళ తెరుక్కూత్తులోనూ ఆమె పేరు "రాణీబాయి" అని 'రాణి అమ్మాళ్' అని, 'రాణీ పద్మిని" అని చెప్పబడుతోంది. చారిత్రకంగా పరిశీలించినపుడు ఆమెని 'రాణి' అనే పేర్కొనడం జరిగింది.

అభిమన్యుడు, బాలరాజు వంటి వారివలే దేశింగురాజు కూడా చిన్నవయస్సులోనే యుద్ధంలో మరణించడం, నవాబుల సైన్యం కంటే తన సైన్యం చిన్నదని తెలిసినప్పటికీ మనోబలంతో

నూ, ఆత్మ విశ్వాసంతోనూ, అత్యంత సాహసంతోనూ యుద్ధం చేయడానికి పూనుకోవడంతోనూ ప్రజల్లో అతడి కీర్తి చిరస్థాయిగా నిలిచిపోయింది.

హృదయాన్ని హత్తుకొనే సన్నివేశ చిత్రణలతో సరసమైన శైలితో అడుగడుగునా వీరరసం వొలికే విధంగా తెలుగు తమిళ భాషల్లో దేశింగురాజు కథ తీర్చిదిద్దబడింది. కాబట్టి మూలానికి కొంత భిన్నంగా వున్నా ఈ కథ ఇప్పటికీ బహుళ జనాదరణ పొందగలుగుతోంది.

*ఉపయుక్త గ్రంథాలు :*


1. *తమిళ లెక్సికన్ (3వ సంపుటి) – తమిళ విశ్వవిద్యాలయ ప్రచురణ*
2. *సంగ్రహాంధ్ర విజ్ఞాన కోశము*
3. *దేశింగు రాజన్ కథయిన్ వరలాట్రు ఉన్మైగళ్ – ఓర్ ఆయ్వు (తమిళం) – కె. శాంత*
4. *అభిదాన చింతామణి (తమిళం) – సున్నాగం కుమారస్వామి*
5. *గ్లోసరీ ఆఫ్ మద్రాసు ప్రెసిడెన్సీ – సి.డి. మెక్లిన్*